సమసమాజ స్థాపన కోసం రాజీవ్‌గాంధీ కృషి

- మంత్రి డాక్టర్ సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశంలో పేదరికాన్ని నిర్మూలించి సమసమాజ స్థాపన కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) కొనియాడారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి సీతక్క పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన హయాంలోనే దేశంలో సాంకేతిక విప్లవం ప్రారంభమైందనీ, కంప్యూటర్ల వినియోగానికి ఆయన ఊతమిచ్చారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ ఆశయాలకనుగుణంగానే రాష్ట్రాభివృద్ధికి సిఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. 'యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్' వంటి కార్యక్రమాలను అభివృద్ధి చేస్తూ యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, పాల్గొన్నారు.

విద్యార్థుల కాస్మోటిక్ ఛార్జీలకు నగదు చెల్లిస్తాం

- సిఎస్ కె రామకృష్ణారావు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థులకు ప్రభుత్వం ఇస్తున్న కాస్మోటిక్ చార్జీలకు ఇక నుంచి నగదు చెల్లిస్తామని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు విద్యార్థుల అకౌంట్లలో నగదు జమ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో రాజీవ్ యువ వికాసం, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ చెల్లింపులు తదితర అంశాలపై సమీక్ష చేశారు. జూన్ మాసంలో పాఠశాలలు పున:ప్రారంభం కాగానే విద్యార్థుల ఆధార్, ఫోటోలను సంబంధిత బ్యాంక్ బ్రాంచీలకు అనుసంధానించాలని సిఎస్ కోరారు. విద్యార్థుల బ్యాంక్ అకౌంట్లకు డెబిట్ కార్డు మంజూరు చేయించాలని ఆదేశించారు. జూన్ చివరి నాటికి రాష్ట్రంలోని వివిధ ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూల్స్ విద్యార్థుల అకౌంట్లలో కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించేలా తగిన కార్యాచరణ చేపట్టాలని ఆదేశించారు. దాదాపు ఆరు లక్షల మంది విద్యార్థులకు ఈ సదుపాయం అందించబోతున్నట్టు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు డీబీటీ ద్వారా చెల్లింపులు జరిగే విధంగా కార్యక్రమాన్ని రూపొందించాలని అధికారులకు సూచించారు. డెబిట్ కార్డు తరహాలో ఒక స్మార్ట్ కార్డును అందించి విద్యార్థులు తమకు కావాల్సిన సబ్బులు, కాస్మోటిక్ వస్తువులు కొనుగోలు చేస్తారని తెలిపారు. మహిళా సంఘాలు నిర్వహిస్తున్న మొబైల్ విక్రయ కేంద్రాల ద్వారా కోనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్‌సి డెవలప్‌మెంట్ ముఖ్యకార్యదర్శి ఎన్ శ్రీధర్, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ ఎ వర్షిణి, బిసి వెల్ఫేర్ కార్యదర్శి ఇ.శ్రీధర్, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్, మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో మోడీ సర్కార్ ఫెయిల్

- ట్రంప్ చెబితేనే కాల్పులు విరమించడం దురదృష్టకరం
- ఇందిరా, రాజీవ్‌లు దేశ ఐక్యతకు పాటుపడ్డారు
- రాజీవ్‌గాంధీ వర్ధంతి సభలో సిఎం రేవంత్



రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫహల్గాం మారణకాండ తర్వాత పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో కేంద్రంలోని మోడీ సర్కార్ విఫలమైందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 34వ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీవ్రవాదులు దేశ పౌరులపై దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. మా దేశాన్ని మేం రక్షించుకోగలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదనే రీతిలో ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం ఫహల్గామ్ ఘటనలో పాకిస్థాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని వెనకడుగు వేశారని విమర్శించారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ చెబితేనే కాల్పుల విరమణ చేసే పరిస్థితికి భారత ప్రభుత్వం గ్రాఫ్ పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద దాడులను సమర్థవంతంగా ఎదుర్కోలేని ప్రభుత్వం దేశాన్నీ, దేశ ప్రజలను ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. ఈ వాస్తవాలను మరిచిన కొంతమంది చేవలేని వ్యక్తులు నేడు రాజీవ్‌గాంధీని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రానికి అండగా నిలబడాల్సిన సమయంలో బయటకు రాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ నేతలు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని సిఎం కొనియాడారు. సరళీకృత ఆర్థిక విధానాలతో ఆయన భారత్‌ను బలమైన దేశంగా నిలబెట్టారని గుర్తు చేశారు. 18 ఏళ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని అన్నారు. "సెక్రటేరియట్ దగ్గర రాజీవ్ గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కొందరు సంకుచిత మనస్తత్వంతో విమర్శలు చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం" అని సిఎం స్పష్టం చేశారు. రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు,

అప్రమత్తంగా ఉండండి

అధికారులకు సిఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు పడుతున్న నేపథ్యంలో ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షించాలని సిఎం రేవంత్ రెడ్డి, సిఎస్ రామకృష్ణారావును ఆదేశించారు. అప్రమత్తంగా ఉండాలని అధికారులను కోరారు. మరో మూడ్రోజులు వర్షాలు పడే అవకాశముందంటూ వాతావరణ శాఖ సూచించిన నేపథ్యంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు, మార్కెట్లలో ఉన్న ధాన్యం తడవకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టాలనీ, కాంటాలు వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ముఖ్యమంత్రి ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బంది పడకుండా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. హైదరాబాద్ నగరంలో వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలనీ, ట్రాఫిక్ ఇబ్బందులు, విద్యుత్తు సమస్యలు లేకుండా చూడాలని సిఎం కోరారు. జిహెచ్‌ఎంసి, పోలీస్, హైడ్రా, ట్రాఫిక్, విద్యుత్తు విభాగాలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు.

సంతాప సభలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ, పక్కన తమ్మినేని

ములకలపల్లి కుమారి పార్టీకి చేసిన సేవలు మరువలేనివి..

- జాన్‌వెస్లీ, తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం సూర్యాపేట జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ములకలపల్లి రాములు భార్య కుమారి పార్టీకి చేసిన సేవలు మరువలేనివని రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం అన్నారు. అనారోగ్యంతో ఉన్న కుమారి మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు ఆస్పత్రిలో మృతి చెందారు. బుధవారం స్వగ్రామమైన కొక్కిరేణిలో కుమారి మృతదేహాన్ని జాన్‌వెస్లీ, తమ్మినేని తదితరులు సందర్శించి పూలమాలలేసి నివాళులర్పించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మునగాల ఎంపిపిగా, జెడ్‌పిటిసిగా పని చేసిన రాములుకు కుమారి నిరంతరం సహాయ సహకారాలు అందించారని గుర్తుచేశారు. పేద కుటుంబంలో పుట్టి పార్టీకి అంకితమై పనిచేశారని చెప్పారు. ప్రజాసేవలో ఉన్న రాములుకు ఆమె ఎంతో ఓర్పుగా అన్ని విధాలుగా సహకారం అందించారని తెలిపారు. పార్టీ, ప్రజాసంఘాల కార్యక్రమాల్లో కుమారి చురుకుగా పాల్గొనేవారన్నారు. కుమారి మృతి సిపిఎంకు, ప్రజాసంఘాలకు తీరని లోటన్నారు. ఆమె అకాల మృతి పట్ల సిపిఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ తరపున సంతాపం సానుభూతి తెలిపారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహిస్తున్న ప్రతి కార్యక్రమంలో కుమారి చాలా ఉత్సాహంగా పాల్గొనేవారన్నారు. అంతిమయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మీ, బండారు రవికుమార్, ఎండి జహంగీర్, సిపిఎం సీనియర్ నాయకులు చెరుపల్లి సీతారాములు, డిజి నర్సింహారావు, రాష్ట్ర కమిటీ సభ్యులు తప్పెట్ల స్కైలాబ్‌బాబు, ఆర్.వెంకట్రాములు, ప్రసాద్, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కొండమడుగు నరసింహ, బట్టుపల్లి అనురాధ, డబ్బీకార్ మల్లేశ్, వ్యవసాయ కార్మిక సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం నల్లగొండ జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

నకిలీ, అర్హత లేని వైద్యులకు మందుల సరఫరా

- హోల్ సేలర్లు, డీలర్లపై చర్యలు తప్పవు
- డిసిఎ వార్నింగ్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

నకిలీ, అర్హత లేని వైద్యులు, లైసెన్స్ లేని షాపులకు మందులను సరఫరా చేసే హోల్ సేలర్లు, డీలర్లపై చర్యలు తీసుకోబోతున్నట్టు డ్రగ్ కంట్రోల్ అథారిటీ (డిసిఎ) హెచ్చరించింది. ఈ మేరకు బుధవారం డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ షానవాజ్ ఖాసిం ఒక ప్రకటన విడుదల చేశారు. డ్రగ్ లైసెన్స్ లేకుండా మందులను నిల్వ ఉంచినా, విక్రయించినా వారిపై డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్, 1940 ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. అదే సమయంలో అలాంటి వారికి చట్టవిరుద్ధంగా, అనధికారికంగా మందులను సరఫరా చేస్తున్న వారిపైనా చర్యలుంటాయని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆమోదించిన లైసెన్స్ పొందిన వారికి మాత్రమే మందులను సరఫరా చేయాలని ఆయన సూచించారు. మందులను సరఫరా చేసే ముందు అవి తీసుకుంటున్న వ్యక్తులు, సంస్థలు డ్రగ్ లైసెన్స్ కలిగి ఉన్నారా? రికార్డు నిర్వహిస్తున్నారా? తనిఖీ చేసుకోవాలని కోరారు. వీటిని పాటించని వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం తెలంగాణ డిసిఎ డ్రగ్ లైసెన్స్ లను జారీ చేస్తుందని తెలిపారు. లైసెన్స్ లేకుండా మందులను విక్రయించేందుకు నిల్వ ఉంచితే చట్ట ప్రకారం గరిష్టంగా ఐదేళ్ల వరకు జైలు శిక్ష ఉంటుందని పేర్కొన్నారు.ఈ ఏడాదిలో ఇప్పటి వరకు చట్టవిరుద్ధంగా మందులను విక్రయించేందుకు నిల్వ ఉంచిన 163 మంది నకిలీలను గుర్తించి కేసులను నమోదు చేశారు. తాజాగా విశ్వసనీయ సమాచారం మేరకు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం, తుక్కుగూడ మున్సిపాల్టీ, రావిర్యాల గ్రామంలో శ్రీ బాలాజీ క్లినిక్ నిర్వహిస్తున్న నకిలీ వైద్యులు గుండ్లపల్లి నర్సింహ, మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం, ఓల్డ్ డోర్నకల్ గ్రామంలోని ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నిర్వహిస్తున్న మొహమ్మద్ మసూద్‌ల వద్ద నుంచి చట్ట విరుద్ధంగా నిల్వ ఉంచిన మందులను స్వాధీనం చేసుకున్నారు. నమూనాలను పరీక్షలకు పంపించారు. తదుపరి విచారణ కొనసాగుతుందనీ, చట్టపరంగా చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు తెలిపారు.

ముందస్తు వర్షాలు.. అలెర్ట్‌గా ఉండండి

- జిల్లా కలెక్టర్లకు సూచించిన ఎస్‌డిఆర్‌ఎస్ చీఫ్ అర్వింద్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలోకి నైరుతీ రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశిస్తున్నందున, అకాల, భారీ వర్షాల పట్ల జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ (ఎస్‌డిఆర్‌ఎఫ్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆయా జిల్లాల కలెక్టర్లను హెచ్చరించారు. ఈనెలాఖరులో గానే రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో రాష్ట్రంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందనీ, వాటివల్ల ఎలాంటి విపత్తులు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలను విడుదల చేశారు. గత ఏడాది ఆగస్టులో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు చేరుకోక పోవడంతో తీవ్ర నష్టం జరిగిందనీ, ఆ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి 12 స్టేట్ డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్ (ఎస్‌ఆర్‌డిఎఫ్)లను సిద్ధంగా ఉంచామన్నారు. ఒక్కో టీమ్‌లో తెలంగాణా స్పెషల్ పోలీస్‌కు చెందిన వందమంది సుశిక్షితులైన పోలీసులు ఉంటారనీ, ఈ బృందాలను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంచామన్నారు. ఎక్కడైనా భారీ వర్షాలు, తుఫానులు వస్తే, కలెక్టర్ల ఆదేశాలతో ఈ బృందాలు అక్కడకు చేరుకొని సహాయ, పునరావాస చర్యలు చేపడతాయన్నారు. వీటికి అదనంగా హైదరాబాద్‌లో మూడు ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను అందుబాటులో ఉంచుతున్నామని వివరించారు. ఉమ్మడి జిల్లా కేంద్రాల్లోని ఫైర్ స్టేషన్ల సిబ్బందికి ప్రత్యేకంగా విపత్తుల నివారణ చర్యలపై శిక్షణను ఇచ్చామన్నారు. హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో తక్షణం స్పందించేలా హైడ్రా బృందాలను కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. కలెక్టర్లు ఈ బృందాలను సమన్వయం చేసుకోవాలని సూచించారు. అలాగే విపత్తుల నివారణలో సుశిక్షితులైన సింగరేణి కాలరీస్ సిబ్బంది సేవలను కూడా ఉపయోగించుకునేలా ఏర్పాట్లు చేశామని చెప్పారు. రాష్ట్రంలో ఎలాంటి ప్రకృతి వైపరీత్యాలు జరిగినా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు విపత్తుల నిర్వహణ శాఖ సంసిద్ధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు.

ప్రభుత్వ వైద్యాన్ని విశ్వసిస్తేనే సంపన్న దేశం

- సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రజలు ప్రయివేటు ఆరోగ్య సంరక్షణను భరించగలిగితే ఆ దేశం ధనిక, సంపన్న దేశం కాబోదని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రజలందరూ ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలను విశ్వసించినప్పుడే ధనిక, సంపన్న దేశంగా పరిగణించగలమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ మేరకు గురువారం ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం పగ్గాలు చేపట్టిన 17 నెలల్లో ప్రజల విశ్వసించిన అనేక సందర్భాల్లో వేములవాడ కూడా ఇలాంటి సందర్భాన్ని వెలుగులోకి తెచ్చిందని పేర్కొన్నారు. సివిల్ జడ్జి జ్యోతిర్మయి తన ప్రసవానికి ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ సౌకర్యాన్ని ఎంచుకుని ఒక ఉదాహరణగా నిలిచారని సీఎం పేర్కొన్నారు. ఈ ఎంపిక ఆమె రెండో బిడ్డకు కూడా ఒక గొప్ప అవకాశమని తెలిపారు. నూతన శిశువు తెలంగాణకు ఒక ఆశాకిరణమని సీఎం అభివర్ణించారు.

పెంచిన మెట్రో ఛార్జీలు పూర్తిగా రద్దు చేయాలి

- 10 శాతం డిస్కౌంట్ మోసం : సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెంచిన మెట్రో చార్జీలను పూర్తిగా రద్దు చేయాలని, ఈ నెల 24 నుంచి పది శాతం డిస్కౌంట్ ఇస్తామని ఎల్అండ్‌టి యాజమాన్యం చెప్పడం ప్రజలను పూర్తిగా మోసం చేయడమేనని సిపిఎం అభిప్రాయపడింది. ఈ మేరకు బుధవారం ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 17న మెట్రో ఛార్జీలు భారీగా పెంచి కంటి తుడుపు చర్యగా పది శాతం తగ్గిస్తామనడం ఎంత వరకు న్యాయమని ప్రశ్నించారు. పెరిగిన మెట్రో ఛార్జీలు, నిర్ణయించిన స్లాబుల వల్ల ఒక్కో ప్రయాణికుడిపై నెలకు వెయ్యి నుంచి రూ. రెండు వేలకు వరకు భారం పడుతుందని, అందువల్ల పెంచిన ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. మెట్రో రైల్ నష్టాలకు ఎల్అండ్‌టి యాజమాన్యమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. పెంచిన ఛార్జీలపై ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు స్పందించకపోవడం శోచనీయమన్నారు. మెట్రో స్టేషన్‌ల వద్ద పార్కింగ్ ఫీజులు వసూలు చేయడంతోపాటు టాయిలెట్లలో డబ్బులు వసూలు చేయడాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ప్రయాణికులకు మెరుగైన సేవల కోసం మెట్రోరైల్ బోగీలను పెంచాలని పేర్కొన్నారు.

షార్ట్ సర్క్యూట్ వల్లే గుల్జార్ హౌస్ ప్రమాదం

- ఫైర్ సేఫ్టీ డిజి నాగిరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దుకాణంలో ఏర్పాటు చేసిన డిస్‌ప్లే బోర్డు వద్ద ఏర్పడిన ఎలక్ట్రికల్ షార్ట్ సర్క్యూట్ వల్లే గుల్జార్ హౌస్ అగ్ని ప్రమాదం సంభవించిందని ఫైర్ డిజీ నాగిరెడ్డి తెలిపారు. ప్రమాద ఘటనలో పొగతో ఊపిరి అడక 17 మంది ఒకే రూమ్‌లో మరణించారని తెలిపారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో మాట్లాడారు. గుల్జర్ హౌస్ అగ్ని ప్రమాదానికి సంబంధించి వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బిల్డింగ్ ప్లాన్‌తో వివరించారు. అగ్ని ప్రమాద ఘటనలో మొదటగా కింద ఫ్లోర్లో ఉన్న దుకాణం కాలి పోయినట్లు వెల్లడించారు. మంటలు అదుపులోకి రాక పోవడంతో వారంత పై ఫ్లోర్‌కు వెళ్లి ఒకే రూంలో మొత్తం లాక్ చేసుకుని ఉండి పోయారని తెలిపారు. మంటలు బాగా వ్యాప్తి చెంది ఎసి కంప్రెసర్ కూడా పేలిపోయిందని తెలిపారు. పై ఫ్లోర్ లోకి పోగ వ్యాప్తి చెందడంతో భారీగా ప్రాణ నష్టం సంభవించిదని తెలిపారు.

ముందే జగ్రత వహించి ఫైర్ డిపార్ట్మెంట్‌కు కాల్ చేసి ఉంటే ఒక్క ప్రాణం కూడా పోయి ఉండేది కాదని తెలిపారు. ఘటన పై ఫైర్ డిపార్ట్మెంట్ పై వస్తున్న వార్తలలో నిజం లేదని తెలిపారు. ఫైర్ ఇంజిన్లు సకాలంలో స్పందించి సహాయక చర్యలు చెపట్టాయిని తెలిపారు.

ఫైర్ డిపార్ట్మెంట్‌కు ఉదయం గం.6.16 సమయంలో అగ్ని ప్రమాద ఘటనకు సబంధించిన కాల్ వచ్చిందని ఉ.6.24 కల్లా ఫైర్ సిబ్బంది ఘటన ప్రాంతానికి చెరుకున్నారని తెలిపారు. ఫైర్ ఇంజన్ లలో మంటలు ఆర్పే సమయంలో నీళ్ల అయిపోయాయన్న ఆరోపణలలో కూడా వాస్తవం లేదన్నారు. బిల్డింగ్ అంతా మంటలు వ్యాపించడంతో పైకి వెళ్లే మార్గం లేకపోవడంతో పక్కనే ఉన్న బిల్డింగు గోడ పగలగొట్టి ఫైర్ సిబ్బంది లోపలికి వెళ్లారని తెలిపారు. సిబ్బంది లోపలికి వెళ్లి చూసేసరికి ఒక రూములో 17 మంది స్పృహ తప్పి పడి ఉన్నారని తెలిపారు. అందరూ గాఢమైన పొగ పీల్చడంతో అపస్మారక స్థితిలో ఉన్నారని వారిని ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేశారని తెలిపారు. ఘటనలో అందరూ చనిపోవడం బాధాకరమని అన్నారు.

జీవితానికి చదువే కీలకం

- మూసధోరణిలో పోవద్దు : మంత్రి సీతక్క
- గిరిజన, ఆదివాసీ విద్యార్థుల ప్రతిభా పురస్కారాలు

గిరిజన, ఆదివాసీ విద్యార్థులతో మంత్రి సీతక్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతి ఒక్కరి జీవితానికి చదువే కీలకమనీ, దాని ద్వారానే ఉన్నతశిఖరాలకు ఎదుగుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) నొక్కి చెప్పారు. మూసధోరణిలో చదివితే ప్రయోజనం ఉండదని సూచించారు. విలువలు, వినయం, సంస్కారం, సామాజిక స్పృహ, సమానత్వ భావన నేర్పించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని ఆకాంక్షించారు. విద్యతో ఎదగాలి..వినయంతో మెలగాలి అని విద్యార్థులకు సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల కొమ్రం ఆదివాసీ భవన్‌లో పదోతరగతి, ఇంటర్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను మంత్రి సీతక్క అందజేశారు. ఆదివాసి పవన్ ప్రాంగణంలో ప్రతిష్టించిన సమ్మక్క సారలమ్మ గద్దెలను మంత్రి దర్శించుకున్నారు. కొమ్రంభీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన కోయ, ఆదివాసీ, గిరిజన సాంప్రదాయ నృత్యాలను మంత్రి తిలకించారు. ఆదివాసీ గిరిజన పెయింటింగ్స్‌తో రూపొందించిన చీరను మంత్రి సీతక్కకు గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు బహుకరించారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మెన్ బెల్లయ్యనాయక్, గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ కె.తిరుపతి, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, గిరిజన శాఖ కార్యదర్శి శరత్, గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ..ట్రైబల్ ఏరియాల్లో చదువు లేకపోవడంతో తమను చిన్నచూపు చూశారని తెలిపారు. ఇప్పుడు ప్రయివేటు విద్యాసంస్థల పిల్లలతో పోటీపడి గిరిజన విద్యార్థులు మార్కులు పొందుతున్నారని చెప్పారు. ఎస్టీలు అధికంగా ఉన్న ములుగు, ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాలు టెన్త్ ఇంటర్ ఫలితాల్లో మొదటి స్థానాల్లో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 8 ఏండ్ల తర్వాత డైట్, 16 ఏండ్ల తర్వాత కాస్మోటిక్ చార్జీలను పెంచామని చెప్పారు. ఇతర విద్యాసంస్థల కన్నా గిరిజన శాఖ పరిధిలోని విద్యాసంస్థల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఇంటర్‌లోనూ 90 శాతానికిపైగా మార్కులు సాధించేలా పనిచేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో ఎస్టీల ప్రత్యేక సంస్కృతిని కాపాడాలన్నారు. ఆదివాసీ గిరిజన విద్యార్థులు తమ ప్రత్యేకతను కాపాడుకోవాలని సూచించారు. గిరిజన సమస్యలేవి ఉన్నా తనతో నేరుగా చెప్పొచ్చని హామీనిచ్చారు. ఐటీడీఏలను తిరిగి బలోపేతం చేయాలని సూచించారు. వందమంది అక్కచెల్లెళ్లను హాస్టల్ తనకిచ్చిందనీ, ప్రస్తుత మీటింగ్‌లోనే తనకు చదువు చెప్పిన ఇద్దరు టీచర్లు ఉన్నారని గుర్తుచేశారు. వారి ప్రోద్భలంతోనే తాను ఈ స్థాయికి ఎదిగానని చెప్పారు. పురస్కారాలు రాని విద్యార్థులు మరింత పట్టుదలతో ముందుకెళ్లి విజయం సాధించాలని మనోధైర్యాన్ని కల్పించారు. పే బ్యాక్ టు సొసైటీ సిద్ధాంతాన్ని ఆచరణలో చేసి చూపించాలని పిలుపునిచ్చారు. గురుకులాలు, గిరిజన విద్యా సంస్థల గౌరవాన్ని నిలబెట్టేలా విద్యార్థులు కష్టపడి చదవాలని కోరారు.

నేటినుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

- 892 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గురువారం నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 29 వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. ఈ మేరకు ఇంటర్ పరీక్షల నియంత్రణ అధికారి (సీవోఈ) జయప్రదబాయి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 2,36,915 మంది అబ్బాయిలు, 1,76,681 మంది అమ్మాయిలు, ఇతరులు ఒకరు చొప్పున మొత్తం 4,13,597 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారని వివరించారు. ఇందులో ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగం నుంచి 2,49,204 మంది, ఒకేషనల్ నుంచి 17,003 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం నుంచి 1,34,988 మంది, ఒకేషనల్ నుంచి 12,402 మంది దరఖాస్తు చేశారని పేర్కొన్నారు. వారి కోసం 892 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. గురువారం నుంచి జరిగే ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు జరుగుతాయని వివరించారు. 30 నిమిషాల ముందు నుంచే పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులకు అనుమతి ఉంటుందని తెలిపారు. హాల్‌టికెట్‌ను తప్పనిసరిగా తేవాలని సూచించారు. మాల్ ప్రాక్టీస్ నివారణకు కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. మొబైల్‌ఫోన్లు, గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి తేవడం నిషేధమని తెలిపారు.

మంత్రి ఉత్తమ్ ప్రయాణిస్తున్న హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల కోదాడలో అత్యవసర ల్యాండింగ్ అయింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి సుడిగాలి పర్యటనకు ఏర్పాట్లు జరిగింది. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి ఉత్తమ్ బుధవారం బయల్దేరారు. కోదాడ సమీపంలోకి రాగానే ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం, సన్నపాటి వర్షం కూడా ప్రారంభం కావడంతో పైలట్ అప్రమత్తమయ్యారు. వాతావరణ శాఖ సూచన మేరకు హెలికాప్టర్‌ను కోదాడలో అత్యవసర ల్యాండింగ్ చేశారు. మంత్రి కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు. మంత్రి హెలికాప్టర్ హైదరాబాద్ నుంచి నేరుగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం మేళ్లచెరువులో ల్యాండ్ కావాల్సి ఉంది.

BEFORE THE HON'BLE ADDL. LXXXVIII CITY CIVIL AND SESSIONS JUDGE (CCH-89) BENGALURU

Comm. A.A. No. 112/2025

IN THE MATTER OF
M/s. CATERPILLAR FINANCIAL SERVICES INDIA PVT. LTD., Ground Floor, Prestige Shantiniketan, Crescent 1, Whitefield Road Hoodi, Whitefield Bengaluru, Bengaluru Urban, Karnataka-560048.
...APPLICANT
AND : Sri. Ganesh Builders & Ors
...RESPONDENTS

Service of Court Summons to Respondent No. 1 through Paper Publication
R1 : 1. SRI GANESH BUILDERS, 5-6-19/1/A, Pakabanda Bazar, Andhra Pradesh - 507002.
Whereas the Applicant has filed the above Application against you to provide adequate security to the Applicant Company equivalent to an amount of **Rs. 34,90,747/-** so as to cover the outstanding loan amount due to the Applicant Company. Take notice that the above case is posted for your appearance **on 04.06.2025.** If you have any defence, you are required to appear before the court either in person or through advocate, duly authorised on the aforesaid date of hearing, failing which the matter will be decided on merits placing you ex-parte.

SCHEDULE OF VEHICLE
A. SCHEDULE
Equipment : Caterpillar SEM, SEM915
Maker's Name : Caterpillar
Model No. : SEM, SEM915
Serial No. : S9E00116
Given under my hand and seal on this 3rd day of May 2025 at Bangalore.
By order of the Court, Senior Sheristedar, Commercial Court Unit, City Civil Court, Bengaluru.
Advocate for Applicant :
#117, Ashwin Arcade, 3rd Floor, Sanjay Nagar Main Road, RMV II Stage, Ashwathnagar, Bangalore, Karnataka-560094.

BEFORE THE HON'BLE ADDL. LXXXVIII CITY CIVIL AND SESSIONS JUDGE (CCH-89) BENGALURU

Comm. A.A. No. 112/2025

IN THE MATTER OF
M/s. CATERPILLAR FINANCIAL SERVICES INDIA PVT. LTD., Ground Floor, Prestige Shantiniketan, Crescent 1, Whitefield Road Hoodi, Whitefield Bengaluru, Bengaluru Urban, Karnataka-560048.
...APPLICANT
AND : Sri. Ganesh Builders & Ors
...RESPONDENTS

Service of Court Summons to Respondent No. 2 and Respondent 3 through Paper Publication
R2 : 1. VEJALLA SURESH KUMAR, 6-3-259/1/503, Near NTR Statue, Srujana Apartment, Bank Colony, Khammam, Andhra Pradesh - 507002.
R3 : 2. VEJALLA MADHAVI LATHA, 6-3-259/1/503, Near NTR Statue, Srujana Apartment, Bank Colony, Khammam, Andhra Pradesh - 507002.
Whereas the Applicant has filed the above Application against you to provide adequate security to the Applicant Company equivalent to an amount of **Rs. 34,90,747/-** so as to cover the outstanding loan amount due to the Applicant Company. Take notice that the above case is posted for your appearance **on 04.06.2025.** If you have any defence, you are required to appear before the court either in person or through advocate, duly authorised on the aforesaid date of hearing, failing which the matter will be decided on merits placing you ex-parte.

SCHEDULE OF VEHICLE
A. SCHEDULE
Equipment : Caterpillar SEM, SEM915
Maker's Name : Caterpillar
Model No. : SEM, SEM915
Serial No. : S9E00116
Given under my hand and seal on this 3rd day of May 2025 at Bangalore.
By order of the Court, Senior Sheristedar, Commercial Court Unit, City Civil Court, Bengaluru.
Advocate for Applicant :
#117, Ashwin Arcade, 3rd Floor, Sanjay Nagar Main Road, RMV II Stage, Ashwathnagar, Bangalore, Karnataka-560094.

విత్తనంపై ప్రయివేటుదే పెత్తనం

- 80 శాతం విత్తనాల ఉత్పత్తి కంపెనీలదే...
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- మార్కెట్‌లో నాసిరకం సీడ్స్
- విత్తన రైతులకు ప్రోత్సాహం కరువు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అత్యంత కీలకమైన విత్తనాలపై ప్రయివేటు కంపెనీల పెత్తనం నడుస్తోంది. వానాకాలం సీజన్ సమీపిస్తున్న తరుణంలో మార్కెట్‌లోకి ఇబ్బడిముబ్బడిగా ఆయా కంపెనీల విత్తన ప్యాకెట్లు వచ్చిపడుతున్నాయి. దీంతో ఆయా కంపెనీలకు కాసుల వర్షం కురుస్తున్నది. రాష్ట్రంలో తెలంగాణ సీడ్ కార్పొరేషన్, వ్యవసాయ విశ్వవిద్యాలయం, నేషనల్ సీడ్ కార్పొరేషన్ కలిపి కేవలం 20 శాతం మాత్రమే విత్తనాలను సరఫరా చేస్తున్నాయి. అదే ప్రయివేటు కంపెనీలు మాత్రం 80 శాతం విత్తనాలను మార్కెట్‌లోకి తెస్తున్నాయి. అంతేకాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా విత్తనాలను పెద్ద ఎత్తున దిగుమతి అవుతున్నాయి. మార్కెట్‌లోకి వస్తున్న విత్తనాల నాణ్యతాతో పాటు నాసిరకం తదితర అంశాలను చెకింగ్ చేయడంలో వ్యవసాయ శాఖ పూర్తిగా విఫలమవుతున్నది. నాసిరకం విత్తనాలను విత్తడం వల్ల పంట ఏపుగా పెరగదు. పైగా దిగుబడి కూడా అంతేంతే. ఆ దిశగా ప్రభుత్వం, వ్యవసాయ శాఖ విత్తనోత్పత్తికి ప్లాన్ చేయకపోవడంతో కాంపెనీలే పైచేయి సాధిస్తున్నాయి.

వరి ఉత్పత్తిలో ప్రథమం...విత్తనం ఉత్పత్తితో అథమం

ధాన్యాన్ని ఉత్పత్తి చేయడంలో రాష్ట్రం ముందు వరుసలో ఉంది. ఆ విత్తనాన్ని ఉత్పత్తి చేయడంలో ప్రభుత్వం వెనుకబడింది. ఈ వానాకాలంలో 66.80 లక్షల ఎకరాల్లో వరి సాగవుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. అందుకు 16.70 లక్షల క్వింటాళ్ల వరి విత్తనం అవసరమని తేల్చింది. కానీ తెలంగాణ సీడ్ కార్పొరేషన్ సరఫరా చేస్తోంది మాత్రం కేవలం 17,790 క్వింటాళ్లు మాత్రమే. నేషనల్ సీడ్ కార్పొరేషన్ ద్వారా 9,500 క్వింటాళ్లు వస్తున్నది. మిగతా విత్తనాలను ప్రయివేటు కంపెనీలే సరఫరా చేస్తున్నాయి. ప్రస్తుతం అవి 18.52 లక్షల క్వింటాళ్ల విత్తనాలను సిద్ధంగా ఉంచాయి. సన్నాల సాగు పెరుగుతున్న నేపథ్యంలో రైతు ప్రయివేటు సీడ్ కంపెనీల నుంచి అధిక ధరలకు విత్తనాలు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కూడా కేవలం 11,084 క్వింటాళ్ల విత్తనాలను మాత్రమే ఉత్పత్తి చేస్తున్నది. ఆ వర్శిటీ వరి, మొక్కజొన్న, మినుములు, పప్పుధాన్యాలు, నూనే గింజలు, పశుగ్రాసం విత్తనాలను అందిస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ విత్తనోత్పత్తి పథకాన్ని ప్రవేశ పెట్టింది. రైతులకు సర్టిఫైడ్ విత్తనాలను సరఫరా చేసే లక్ష్యంతో ఈ పథకాన్ని ఏర్పాటు చేసింది. 75 శాతం సబ్సిడీతో ప్రతి గ్రామంలో 25 నుంచి 150 మంది రైతులను ఈ పథకంలోకి తీసుకరానుంది. కానీ ఆ పథకం ఇంకా పట్టాలెక్కలేదు.

కాటన్ సీడ్ మాయాజాలం

పత్తిని తెల్లబంగారం అని కూడా అంటారు. అది వాణిజ్య పంటగా ప్రసిద్ధి చెందింది. వరి సాగు తర్వాత పత్తి సాగు రెండోస్థానంలో ఉంది. తెలంగాణలో 50 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కానుంది. అందుకు 45 వేల క్వింటాళ్ల పత్తి విత్తనాలు అవసరం. ఈ క్రమంలో ప్రయివేటు కాటన్ సీడ్ కంపెనీలు ఇప్పటికే 1.34 లక్షల క్వింటాళ్లు అందుబాటులోకి తెచ్చాయి. రాష్ట్రంలో పత్తి సాగు విస్తీర్ణం పెరుగుతున్నా... దాని విత్తనాల బాధ్యతను ప్రభుత్వం ప్రయివేటు కంపెనీలకే వదిలేసింది. సీజన్ వచ్చిందంటే చాలు ఆయా కంపెనీలు వేల కోట్లమేర విత్తన వ్యాపారం చేస్తున్నాయి. బీటీ-2 ప్యాకెట్‌ను రూ. 901 ధరకు అమ్ముతున్నారు. స్థానిక కంపెనీలే కాకుండా ఐదారు కార్పొరేట్ కంపెనీలే కాటన్ సీడ్‌పై పెత్తనం చెలాయిస్తున్నాయి. పత్తి విత్తనం ధర 2018లో రూ.710 ఉండగా, 2025లో రూ. 901కి చేరుకుంది.ఆయా కంపెనీలు ప్రతి ఏటా రెండు, మూడు శాతం ధరలను పెంచేస్తున్నాయి. కాటన్ సీడ్ ధరలను నియంత్రించడం ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. ఇదే క్రమంలో బీటీ-3 కాటన్ సీడ్ పేరిట రైతులను కంపెనీలు పెద్ద ఎత్తున మోసం చేస్తున్నాయి. ఈ విత్తనం నాటితే తెగుళ్లు రావనీ, కలుపు మందులు వేయాల్సిన అవసరం లేదంటూ అబద్దపు ప్రచారం చేస్తున్నాయి. ఈ విత్తనాలు మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుంచి రహస్యంగా దిగుమతి అవుతున్నాయి. వ్యాపారులు ఒక్కొక్క ప్యాకెట్‌ను రూ. 2వేలకు అమ్ముతున్నాయి. ఈ క్రమంలో నకిలీ విత్తన సరఫరాలో వ్యవసాయ అధికారులు, కంపెనీలు కుమ్మక్కై రైతులకు కట్టబెడుతున్నారనే ప్రచారం జరుగుతున్నది. దీంతో ప్రతిఏటా రాష్ట్రంలో 4, 5 లక్షల ఎకరాల్లో రైతులు పంట నష్టపోతున్నారు. నకిలీ విత్తనంతో పంట దెబ్బతింటే దానికి పరిహారం కూడా రైతులకు అందడం లేదు. సదరు కంపెనీలపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదు.

టామాటా విత్తనం కూడా

వరి, పత్తి విత్తనాలే కాకుండా చివరకు టామాటా విత్తనాన్ని కూడా ప్రభుత్వం ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్నది. ఉత్తరప్రదేశ్, హర్యానా, తమిళనాడు, కర్నాటక, గుజరాత్ తదితర రాష్ట్రాల నుంచి టామాటా సీడ్ దిగుమతి అవుతున్నది. రాష్ట్రంలో టామాట పంటకు అనువైన నేలలు ఉన్నప్పటికీ రైతులకు ప్రోత్సహం లేకపోవడం వల్ల విత్తనోత్పత్తి చేయలేకపోతున్నారు. కర్నాటక నుంచి కందులు, సోయా, మహారాష్ట్ర నుంచి పత్తి విత్తనాన్ని కొనుగోలు చేస్తున్నారు. పంట కాలనీలు ఏర్పాటు చేసి, ఆ రైతులకు భరోసా కల్పించడం ద్వారా విత్తనోత్పత్తి చేయవచ్చు అని నిపుణులు చెబుతున్నారు. అంతేకాకుండా సబ్సిడీతో రైతులకు సరిపడిన విత్తనాలను ప్రభుత్వమే సరఫరా చేయాలని రైతు సంఘాలు కోరుతున్నాయి.

కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు పరిష్కరించాలి

- లారీల కొరత తీర్చాలి : టి సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతుల సమస్యలు తక్షణమే పరిష్కరించి, కొనుగోళ్లు పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం చందంపేట, అల్మాయిపేట, అందోల్ గ్రామాల్లో బుధవారం రైతు సంఘం నాయకులు పర్యటించారు. తడిసిన ధాన్యాన్ని పరిశీలించి.. రైతులతో మాట్లాడి ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. వారం రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలని చెప్పినా అమలు కావటం లేదన్నారు. పంట చేతికొచ్చి నెలలు గడుస్తున్నా ధాన్యం కాంటా వేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తూకం వేసిన ధాన్యాన్ని గోదాములకు తరలించడంలో, సకాలంలో లారీలు పంపించడంలో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందన్నారు. అనేక కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. దీనికి బాధ్యులైన అధికారులను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వర్షాలకు తడిసి అనేక కేంద్రాల్లో వడ్లు మొలకెత్తాయని, వెంటనే తడిసిన వడ్లను తేమ శాతంతో సంబంధం లేకుండా కొనుగోలు చేయాలని అన్నారు. తేమ, తాలు, తరుగు పేరుతో రైతులకు ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. తూకం చేసిన ధాన్యం సైతం కేంద్రాల్లో 15 రోజులకు పైగా అక్కడే ఉండటం చాలా దుర్మార్గమన్నారు.

రైతులతో మాట్లాడుతున్న టి సాగర్

అధికారుల మధ్య కొరవడిన సమన్వయం

రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు

ధాన్యం కొనుగోళ్లలో అధికారుల మధ్య సమన్వయం సరిగ్గా లేదని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గొల్లపల్లి జయరాజు అన్నారు. రైతులు తమ సమస్యలను పరిస్కారం చేయాలని, లారీలు పంపించాలని వారం రోజులుగా అడుగుతున్నా అధికారులు స్పందించటం లేదన్నారు. లారీలు పంపని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. రైస్ మిల్ వారు క్వింటల్‌కు 6-7 కిలోల తరుగు తీస్తుంటే అధికారులు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రైతులను నిలువు దోపిడీ చేస్తున్న దానిపై విచారణ జరపాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.రాజయ్య, సిపిఎం అందోల్ డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్, రైతు సంఘం నాయకులు ప్రభాకర్, మల్లారెడ్డి, రైతులు సత్యనారాయణ, వెంకట్ రెడ్డి, శివకుమార్, శ్రీనివాస్, అర్జున్ తదితరులు ఉన్నారు.

సునీతారావుకు షోకాజ్ నోటీస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం, టిపిసిసి అధ్యక్షులపై తీవ్ర ఆరోపణలు చేసిన మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావుకు జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు అల్కాలంబ షోకాజ్ నోటీస్ జారీ చేశారు. వారం రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ సునీతారావుకు బుధవారం ఆమె లేఖ రాశారు. సునీతారావు చేసిన వ్యాఖ్యలను పార్టీ తీవ్రంగా పరిగణించిందని ఆమె పేర్కొన్నారు. సునీతారావుపై పలువురు నాయకులు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే.

కాంగ్రెస్ చేరిన కంజర్ల విజయలక్ష్మి దంపతులు

- కండువా కప్పిన మహేష్‌కుమార్‌గౌడ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మాజీ మంత్రి లక్ష్మీనారాయణ కోడలు కంజర్ల విజయలక్ష్మి-చంద్రకాంత్ యాదవ్ దంపతులు కాంగ్రెస్‌లో చేరారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సనత్‌నగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి కోట నీలిమ ఆధ్వర్యంలో ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎంపి అనిల్‌కుమార్ యాదవ్, విజయారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్లు తదితరులు ఉన్నారు.

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం..

- గద్వాల వాసులు ఐదుగురు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

కర్ణాటక రాష్ట్రం విజయపుర జిల్లా మనగులి సమీపంలో బుధవారం తెల్లవారుజామున కారు, ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొన్నాయి. ఈ ఘటనలో కారులో ఉన్న జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం మల్లెందొడ్డి గ్రామానికి చెందిన టి భాస్కర్, ఆయన భార్య పవిత్ర, కుమారుడు అభిరామ్, కుమార్తె జ్యోత్స్న, డ్రైవర్ శివప్ప అక్కడికక్కడే మృతిచెందారు. తీవ్రంగా గాయపడిన భాస్కర్ మరో కొడుకు ప్రవీణ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. భాస్కర్ కెనరా బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తూ కుటుంబ సభ్యులతో గద్వాల్ బిసి కాలనీలో నివసిస్తున్నాడు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

పిపిఎస్ మోటార్స్‌లో స్కోడా కోడియాక్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్

లగ్జరీ కార్ల కంపెనీ స్కోడా తన స్కోడ కోడియాక్‌ను హైదరాబాద్‌లోని కొండాపూర్‌లోని పిపిఎస్ మోటార్స్ షోరూంలో ఆవిష్కరించింది. ఇది సరికొత్త తరం ఎస్‌యువి అని పిపిఎస్ మోటార్స్ ఎండి రాజీవ్ సంఘ్వీ పేర్కొన్నారు. నగరాల్లోని రోడ్లతో పాటు ఎలాంటి భూభాగం మీదైనా వెళ్లగలిగే అద్భుతమైన రికార్డు, హ్యాండ్లింగ్‌ను ఇది అందిస్తుందని స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ పీటర్ జానెబా పేర్కొన్నారు.

గుల్జార్ హౌజ్ నుంచి దృష్టి మళ్లించేందుకే కెసిఆర్‌కు నోటీసులు

- మాజీ మంత్రి గంగుల కమలాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుల్జార్ హౌజ్ అగ్ని ప్రమాద ఘటన వైఫల్యం నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే కాళేశ్వరం విషయంలో కెసిఆర్‌కు నోటీసుల చిల్లర రాజకీయాలు చేస్తున్నారని మాజీ మంత్రి గంగుల కమలా కర్ విమర్శించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కెసిఆర్‌కు నోటీస్ ఇవ్వడమంటే తెలంగాణ ప్రజలందరికి నోటీసు ఇచ్చినట్టేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒక ఇంటి నిర్మాణం చేశాక, బాత్ రూంలో లీకేజీ అయితే ఇల్లు కూలిపోతుందా? అని ప్రశ్నించారు. కాళేశ్వరం అంటే మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని స్పష్టం చేశారు. కేసీఆర్‌కు నోటీసులు కేవలం రాజకీయ ఒత్తిడితో ఇచ్చినవేనని, వాటికి బెదిరేది లేదన్నారు. అందరితో చర్చించి విచారణకు హాజరు కావాలా? వద్దా? అనేది కెసిఆర్ నిర్ణయం తీసుకుంటారని గంగుల తెలిపారు. మాజీ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌కు గోదావరి నీళ్ల తరలించే కుట్ర జరుగుతుందని విమర్శించారు. మేడిగడ్డ బ్యారేజీ లేకుండా చేసి తరలించేందుకు కుట్ర చేస్తున్నారని తెలిపారు. పోలవరం డయాఫ్రమ్ వాల్ కూలిపోతే, ఎస్ఎల్బీసీ టన్నెల్ ప్రమాదం, సుంకిశాల కూలిపోతే, వట్టెం పంప్ హౌజ్ మునిగిపోతే కమిషన్ ఎందుకు వేయలేదని ప్రశ్నించారు. మంత్రి సత్యవతీ రాథోడ్ మాట్లాడుతూ ఎస్ఆర్ఎస్‌పి ప్రాజెక్టు చివరి ఆయకట్టు దాకా నీళ్లు రావడానికి కాళేశ్వరం ప్రాజెక్టుయే కారణమని తెలిపారు. ప్రజా క్షేత్రంలోనే రేవంత్ ఆగడాలను ఎదుర్కొంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ .రేవంత్ సిఎం అయ్యాక ఏన్నో ప్రమాదాలు జరిగాయాయనీ, వాటన్నిటిపై కమిషన్‌లు వేశారా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కెపి వివేకానంద, బండారి లక్ష్మారెడ్డి ,ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు కూడా పాల్గొన్నారు.

హెచ్ఎండిఎ ల్యాండ్ పూలింగ్‌పై కదలిక

- భారీ లే అవుట్లకు ప్రణాళిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ పరిధిలోని భూ సమీకరణ (ల్యాండ్‌పూలింగ్)పై కదలిక వస్తోంది. రైతుల నుంచి భూ సమీకరణ చేసి వాటిని భారీ లేఅవుట్లుగా తీర్చిదిద్దేందుకు తాజాగా హెచ్ఎండిఎ ప్రణాళిక సిద్ధం చేస్తోంది. మహానగరం చుట్టూ ఉన్న గ్రామాల్లో రైతుల వ్యవసాయేతర భూములను వారి ఇష్టంతోనే సమీకరించి వాటిని అభివృద్ధి చేసేందుకు హెచ్ఎండిఎ గతంలోనే శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తొలుత ఇమ్మల్‌నర్వలో 95.25 ఎకరాలు, లేమూరులో 83.48 ఎకరాల్లో లేఅవుట్ అభివ ద్ధి పనులు ప్రారంభించింది. మిగతా ప్రాంతాల్లోనూ అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపారు. తర్వాత మధ్యలో ఈ కార్యక్రమానికి కొంత బ్రేక్ పడింది. తాజాగా మళ్లీ దీన్ని ముందుకు కదిలించేందుకు యంత్రాంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అభివృద్ధి చేసిన భూమిలో రైతులకు 60 శాతం బదిలీ చేస్తుంది.

భవిష్యత్తులో నగర అభివృద్ధి మొత్తం ఓఆర్ఆర్, ప్రాంతీయ రింగు రోడ్డు చుట్టూ కేంద్రీకృతం కానుండటంతో ఆ మేరకు భారీ లేఅవుట్లకు డిమాండ్ ఉంటుందని హెచ్ఎండీఏ భావిస్తోంది. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య నివాస సముదాయాలు, విల్లాలు, వాణిజ్య, వ్యాపార సముదాయాలు, శాటిలైట్ టౌన్‌షిప్‌ల నిర్మాణం తప్పనిసరి. అన్ని ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు అందుబాటులో లేకపోవడంతో వ్యవసాయానికి పనికిరాని భూములను సమీకరించాలని యోచిస్తున్నారు. గతంలో హెచ్ఎండిఎ వేలం వేసినప్పటికీ ధరలు సామాన్యులకు అందనంత దూరంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో నగరానికి కొంత దూరంగా అవుటర్ రింగ్‌రోడ్డు, ప్రాంతీయ రింగురోడ్డుకు మధ్య లేఅవుట్లు అభివృద్ధి చేసి వేలం వేయడం ద్వారా మధ్యతరగతి ప్రజలు కూడా కొనుగోలు చేయడానికి ముందుకొచ్చే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

హయత్‌నగర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

- కారు, డిసిఎం ఢీకొని ముగ్గురు యువకులు మృతి
- మరొకరి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద బ్యూరో

పది నిమిషాల్లో వారు ఇంటికి చేరుకునే వారు. కానీ ఈలోగా వారు ప్రయాణిస్తున్న కారు ఎదురుగా వస్తున్న డిసిఎంను వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే ప్రాణం కోల్పోయారు. ఈ విషాద ఘటన రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కుంట్లూర్ గ్రామ పరిధిలో బుధవారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ నాగరాజ్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట మున్సిపాల్టీ కుంట్లూర్ గ్రామానికి చెందిన పిన్నిటి చంద్రసేనారెడ్డి (24), చుంచు త్రినాథ్ రెడ్డి (24), చుంచు వర్షిత్ రెడ్డి (24), అలివేటి పవన్ కల్యాణ్ రెడ్డి కలిసి సెకండ్ హ్యాండ్ కార్ల బిజినెస్ చేస్తున్నారు. మహారాష్ట్రలో సెకండ్ హ్యాండ్ కార్లు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయిస్తుంటారు. ఈ నెల 20న స్కోడా కారులో పెద్ద అంబర్‌పేటలో ఓ శుభకార్యానికి హాజరై.. నారపల్లిలో ఉన్న త్రినాథ్‌రెడ్డి ఫామ్ హౌస్‌కు వెళ్లి అక్కడే బస చేశారు. బుధవారం తెల్లవారుజామున కారులో హయత్‌నగర్ నుంచి పసుమాముల మీదుగా ఇంటికి చేరుకునే సమయంలో నారాయణ కాలేజ్ బాలికల క్యాంపస్ వద్దకు రాగానే నిద్రమత్తు, అతివేగంతో ప్రయాణిస్తున్న వీరంతా ఎదురుగా వస్తున్న డిసిఎంను ఢీకొట్టారు. దాంతో చంద్రసేనారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందారు. అలివేటి పవన్ కళ్యాణ్‌రెడ్డి తీవ్రగాయాలతో హయత్‌నగర్‌లోని ఓ ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతదేహాలను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ముగ్గురి మృతితో కుంట్లూరు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి సంబంధించిన సిసి ఫుటేజ్ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.

తాయారమ్మకు తుది వీడ్కోలు

- గాంధీ వైద్య కళాశాలకు భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అనారోగ్యంతో కన్నుమూసిన ఐద్వా సీనియర్ నాయకురాలు కంచి తాయారమ్మకు సిపిఎం, ఐద్వా, ఇతర ప్రజా సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు బుధవారం తుది వీడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిటిజన్ ఆస్పత్రిలో ఆమె మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆమె భౌతికకాయానికి సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సిపిఎం సిటీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎమ్.వెంకటేశ్, మాజీ కార్యదర్శి ఎం శ్రీనివాస్, మేడ్చెల్ కార్యదర్శి సత్యం, సీనియర్ నాయకులు పిఎస్ఎన్ మూర్తి, ఆర్‌బిఐ నాయకులు నాగేశ్వరరావు, కెఎస్ఎన్ రాజు (ఎల్‌ఐసి), శ్రీకాంత్, ఈశ్వరరావు (సిఐటియు), ఎమ్ఎన్ రెడ్డి (టాప్రా), నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్, సీనియర్ జర్నలిస్టు జి రాజకుమారి తదితరులు నివాళులర్పించారు. అనంతరం గాంధీనగర్ నుంచి ఆమె అంతిమయాత్ర బయలుదేరి, ముషీరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి చేరుకుంది. అక్కడ ఉదయం 11.30 గంటలకు తాయారమ్మ భౌతికాకాయాన్ని ఆమె కుటుంబ సభ్యులు అశ్రునయనాల మధ్య గాంధీ వైద్యకళాశాలకు అప్పగించారు.

శరవేగంగా టిమ్స్ నిర్మాణ పనులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సనత్‌నగర్ టిమ్స్ ఆస్పత్రి నిర్మాణ పనులను ఉన్నతాధికారులు పరిశీలించారు. బుధవారం వైద్యారోగ్యశాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టీనా చొంగ్తూ, రోడ్లు, భవనాల శాఖ కార్యదర్శి దాసరి హరిచందన, హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అడిషనల్ కలెక్టర్ ముకుంద రెడ్డి, డీఎంఈ డాక్టర్ నరేందర్ కుమార్, టిమ్స్ సనత్ నగర్ నోడల్ ఆఫీసర్, నిమ్స్, కిమ్స్, యశోద, ఏఐజీ ఆస్పత్రుల సీనియర్ వైద్యులు నిర్మాణ పనులను పరిశీలించారు. కార్డియాక్, కార్డియోథొరాసిక్ సర్జరీ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్ సైన్సెస్ కు ప్రత్యేకంగా ఈ ఆస్పత్రి నిర్మిస్తున్నారు. ఇందులో భాగస్వాములుగా ఉన్న వివిధ శాఖలు సమన్వయంతో ముందుకెళ్లాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించిన నేపథ్యంలో వివిధ శాఖలు, భాగస్వాములు సైట్‌ను సందర్శించి సమీక్షించారు. ఈ సమీక్షలో మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ప్రతినిధులతో పాటు సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు. తాము గమనించిన విషయాలతో అన్ని శాఖల సమన్వయంతో పనులను సకాలంలో పూర్తి చేసేందుకు వీలుగా పలు సూచనలు చేశారు.

చిన్నారితో వైద్య సిబ్బంది

ఎస్ఎంఎ జన్యు చికిత్స విజయవంతం

- రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ ముందడుగు

ప్రజాశక్తి హైదరాబాద్ బ్యూరో

భారతదేశంలో పిల్లలు, ప్రసూతి, గైనకాలజీ విభాగాల్లో అగ్రగామిగా ఉన్న సికింద్రాబాద్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సిబ్బంది చిన్నారికి విజయవంతంగా జన్యు చికిత్సను నిర్వహించింది. పీడియాట్రిక్ ఆరోగ్య సంరక్షణలో ఇది ఒక కీలక మైలురాయిగా నిలిచింది. ఈ చికిత్స కన్సల్టెంట్ పీడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ రమేష్ కోనంకి పర్యవేక్షణలో జరిగింది. స్పైనల్ మస్క్యులర్ అట్రోఫీ (ఎస్ఎంఎ) అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రతి పది వేల మంది పిల్లలలో సుమారు ఒకరిని ప్రభావితం చేసే ఒక తీవ్రమైన జన్యుపరమైన నరాల కండరాల సంబంధిత వ్యాధి. భారత్‌లో ఈ వ్యాధితో దాదాపు వెయ్యి మంది పిల్లలు బాధపడుతున్నట్లు అంచనా. సకాలంలో చికిత్స అందించకపోతే, ఈ వ్యాధి ప్రాణాంతకంగా మారుతుంది. చిన్నారి తండ్రి వినీత్ చౌదరి మాట్లాడుతూ,. "ఈ చికిత్స మా కుటుంబానికి కొత్త ఆశను ఇచ్చింది. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ బందం చూపిన అంకితభావానికి మేము హదయపూర్వకంగా కతజ్ఞులం " అని చెప్పారు.

నిజాం రాచరిక పాలనపై పోరాడిన ధీశాలి బండి యాదగిరి

ప్రజాశక్తి కల్చరల్

నిజాం రాచరిక పాలనపై పోరాడిన ధీశాలి బండి యాదగిరి అని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ కాశీవిశ్వేశ్వం రావు అన్నారు. ఎందరో మహానుభావులు మధురస్మృతులు కార్యక్రమంలో భాగంగా మంగళవారం త్యాగరాయ గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళా విఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన విప్లవ కవి బండి యాదగిరి సంస్మరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా హాజరై జస్టిస్ కాశీ విశ్వేశ్వర్ రావు మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో ప్రాచుర్యం పొందిన వీర తెలంగాణ పోరాట ఘట్టంలో స్వయంగా రాసి పాడిన 'బండెనక' పాట నాడే కాదు నేడూ పోరాట స్ఫూర్తిని కలిగిస్తుందన్నారు. నాటి నిజాం కాలంలో వెట్టి చేసి బతుకులీడ్చిన దళిత బిడ్డ యాదగిరి అని, భూ స్వాముల వద్ద పని చేస్తున్న సమయంలోనే సాయుధ పోరాట సైరన్ శబ్దాల్ని గమనించి ఉక్కు మనిషిలా పిడికిలి బిగించి దొర కింద చేసే చాకిరికి స్వస్తి చెప్పి జనం కోసం యుద్ధ భూమిలో తన ప్రాణాలను త్యాగం చేసిన వీరుడు అని అన్నారు. నిజాం గుండెలను ధఢధడలాడించిన పాట వింటేనే మట్టి మనుషులు సాగించిన సాయుధ విప్లవ రైతాంగ పోరాటం స్ఫూరిస్తుందని వివరించారు. యాదగిరి అక్షరాలకు నోచుకోక పోయినా ఆయుధాల్లాంటి పాటలు రాసి ప్రజల్ని మేల్కొల్పాడని పేర్కొన్నారు. శత్రువులను గడగడలాడించి ప్రజల విముక్తి కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. సభలో మానస ఆర్ట్స్ సంస్థ అధినేత రఘుశ్రీ, కేంద్ర ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు ఎస్ బి రామ్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

మలేషియా జైల్లోని తెలంగాణ వాసులు విడుదల

- అండగా నిలిచిన బిఆర్ఎస్ నేత జాన్సన్ నాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి కోసం గత సంవత్సరం ఆదిలాబాద్ జిల్లా కడెం మండలం లింగాపూర్, దస్తురాబాద్ మండలం మూన్యాల్ గ్రామాలకు చెందిన ఆరుగురు వ్యక్తులు మలేషియాకు వెళ్లారు. అయితే అకారణంగా అరెస్ట్ అయి జైలుపాలయ్యారు. ఈ విషయం తన దృష్టికి రావడంతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, పార్టీ నేత ఖానాపూర్ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్‌తో మాట్లాడి వారి విడుదలకు ప్రయత్నించాలని కోరారు. దీంతో బాధిత కుటుంబాలను కలిసిన జాన్సన్ నాయక్ వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వారి దీనస్థితిని కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచనతో మార్చి నెలలో మలేషియా వెళ్లిన జాన్సన్ నాయక్, జైల్లో ఉన్న లింగాపూర్ గ్రామానికి చెందిన రాచకొండ నరేష్, తలారి భాస్కర్, గురుజాల శంకర్, గురిజాల రాజేశ్వర్, గుండా శ్రీనివాస్, మూన్యాల్ గ్రామానికి చెందిన యమునూరి రవీందర్‌లను కలిసి ఓదార్చారు. విడుదల చేయిస్తానని భరోసా కల్పించారు. అక్కడి చట్టాల పట్ల అవగాహన లేకపోవడంతో అక్రమ ఆయుధ కేసులో అరెస్ట్ అయ్యారని తెలుసుకున్న జాన్సన్ నాయక్, వారి విడుదల కోసం సొంత ఖర్చులతో స్థానిక న్యాయవాదులను నియమించి న్యాయపరమైన ప్రక్రియను వేగవంతం చేశారు. ఇటీవల మే 12న మలేషియాకు మళ్లీ వెళ్లి అక్కడి కోర్టు విధించిన జరిమానా మొత్తాన్ని తన సొంత ఖర్చులతో చెల్లించి, విమాన టికెట్లతో సహా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసి వారిని స్వదేశానికి తీసుకొచ్చారు.

బుధవారం హైదరాబాద్‌కు చేరుకున్న బాధితులు జాన్సన్ నాయక్‌తో కలిసి నందినగర్‌లో కేటీఆర్‌ని కలిసారు. కేటీఆర్‌ను చూడగానే భావోద్వేగానికి గురైన బాధితులు, జైల్లో ఉండగా ఈ దేశాన్ని తమ పిల్లలను చూస్తామని అనుకోలేదన్నారు. కెటిఆర్, జాన్సన్ నాయక్‌ల కృషితో తాము విడుదలయ్యామని, జీవితాంతం వారిని తమ గుండెల్లో పెట్టుకుంటామని చెప్పారు. చైనా, ఇతర దేశాలు తమ వారిని దగ్గరుండి వారం రోజుల్లో విడిపించి తీసుకువెళ్లిపోయాయని బాధితులు కెటిఆర్‌తో తెలిపారు. వారిని ఓదార్చిన తర్వాత వారి బాగోగులను, అక్కడ వారికి ఎదురైన కష్టాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. వారి పరిస్థితి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. జాన్సన్ నాయక్ ను కెటిఆర్ ప్రత్యేకంగా అభినందించారు. భారత రాయబార కార్యాలయం కానీ, తెలంగాణ ప్రభుత్వం గానీ బాధితులను విడిపించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమని విచారం వ్యక్తం చేశారు. కనీసం న్యాయవాదులను పెట్టి వెంటనే విడిపిస్తే బాగుండేదని అభిప్రాయపడ్డారు.

మేడిపల్లిలో ఆక్రమణలు కూల్చివేసిన హైడ్రా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో ఆక్రమణలపై హైడ్రా అధికారుల చర్యలు కొనసాగుతున్నాయి. బుధవారం మేడిపల్లిలోని ఓ ప్రైవేటు స్కూల్ అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చివేసింది. ఆర్ఎఆర్ కాలనీ నుంచి హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారికి వెళ్లే లింక్ రోడ్డును స్కూల్ యాజమాన్యం ఆక్రమించి నిర్మాణాలు చేపట్టినట్లు కాలనీ వాసులు హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన విచారణ చేపట్టి రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని గుర్తించారు. కమిషనర్ ఆదేశాలతో అధికారులు, సిబ్బంది అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. గత 15 ఏళ్లుగా ఈ రోడ్డు కబ్జాపై పోరాడుతున్నా న్యాయం జరగలేదని, హైడ్రాతో న్యాయం జరిగిందని కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు.